క్లుప్తంగా

సీసీరోడ్ల నిర్మాణానికి భూమిపూజ



భూమిపూజ చేస్తున్న జెడ్పీటీసీ రామారావు

దహెగాం: మండలంలోని కల్వాడ పంచాయతీలో జెడ్పీటీసీ తాళ్లపల్లి రామారావు గురువారం సీసీరోడ్ల నిర్మాణానికి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప ఆదేశాలతో పనులు ప్రారంభించినట్లు తెలిపారు. మారుమూల గ్రామాల అభివృద్ధే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయమన్నారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ చంద్రశేఖర్‌గౌడ్, నాయకులు మధుకర్, సాయివర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

రెబ్బెన: మండలంలోని మాద్వాయిగూడలో ఈజీఎస్ నిధులు రూ.4 లక్షలతో సీసీ రోడ్డు పనులను సర్పంచ్ డోబే పార్వతి గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ సహకారంతో పంచాయతీలోని అన్నికాలనీల్లో పూర్తిస్థాయిలో సీసీ రోడ్లు నిర్మిస్తామన్నారు. ఉప సర్పంచ్ గోపాల్, బీఆర్ఎస్ నాయకులు ఆనంద్, విలాస్, వినోద్, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

'చలో ఢిల్లీ'ని జయప్రదం చేయాలి



మాట్లాడుతున్న నాయకులు

కౌటాల: కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఏప్రిల్ 5న చేపట్టిన చలో ఢిల్లీ కార్యక్రమాన్ని కార్మికులు విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా నాయకుడు వెలిశాల క్రిష్ణమాచారి కోరారు. మండల కేంద్రంలో గురువారం హమాలీ కార్మికులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. స్కీంవర్కర్లకు కనీస వేతనం రూ. 26 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్మికుల సమస్యలు పరిష్కరించడంలో కేంద్ర ప్రభుత్వం విఫలమైందన్నారు. కార్మికుల సమస్యలపై పోరాటం చేయడానికి సీఐటీయూ ముందుంటుందని తెలిపారు. సమావేశంలో హమాలీ వర్కర్స్ సంఘం నాయకులు పెరుగు విఠల్, కిశోర్, సంతోష్, వెంకటి, దేవాజీ, అంజన్న, సునీల్, విలాస్ తదితరులు పాల్గొన్నారు.

సైబర్‌నేరాలపై అప్రమత్తంగా ఉండాలి



కళాజాత ప్రదర్శన ఇస్తున్న బృందం సభ్యులు

సిర్పూర్(టి): సైబర్ నేరాలపై ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని సిర్పూర్(టి) ఎస్సై రమేశ్ అన్నారు. మండలంలోని చింతకుంటలో సైబర్ నేరాలు, బాల్యవివాహాలు, సురక్షిత డ్రైవింగ్ తదితర అంశాలపై బుధవారం రాత్రి కళాజాత ప్రదర్శన నిర్వహించారు. బాల్య వివాహాలతో జరిగే అనర్థాలు, మూఢ నమ్మకాల వల్ల కలిగే నష్టాలపై బృందం సభ్యులు ఆటాపాట రూపంలో వివరించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ వాహనదారులు మద్యం తాగి వాహనాలు నడపొద్దని సూచించారు. ఎంపీటీసీ మంగిలాల్, మాజీ సర్పంచ్ మహేందర్‌నాయక్, గ్రామస్తులు పాల్గొన్నారు.

25 నుంచి క్రికెట్ పోటీలు

కౌటాల: మండలంలోని వీరవెల్లిలో ఈనెల 25 నుంచి గ్రామ పంచాయతీ లెవల్ క్రికెట్ పోటీలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు సంతోష్, గణేశ్, రవీందర్ గురువారం తెలిపారు. స్థానిక క్రీడా మైదానంలో పాల్వాయి పురుషోత్తంరావు స్మారక క్రికెట్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నామని, ఆసక్తి ఉన్న క్రీడాకారులు శుక్రవారం లోగా రూ.1200 ఎంట్రీ ఫీజు చెల్లించి తమ జట్టు పేరు నమోదు చేసుకోవాలన్నారు. ఈ టోర్నీలో గెలుపొందిన జట్టుకు ప్రథమ బహుమతి రూ.25 వేలు, ద్వితీయ బహుమతి రూ.15 వేలు అందించనున్నట్లు తెలిపారు. వివరాలకు 9347265018, 9381065816 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

'పది'లో ఉత్తమ ఫలితాలు సాధించాలి

ఆసిఫాబాద్‌రూరల్: పదో తరగతి పరీక్షల్లో విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలని ఉర్దూ మీడియం పాఠశాల చైర్మన్ అబ్దుల్ హన్నాన్ అన్నారు. జిల్లాకేంద్రంలోని ఉర్దూ మీడియం పాఠశాలలో గురువారం నిర్వహించిన తల్లిదండ్రుల సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యార్థులను ఉపాధ్యాయులు పరీక్షలకు సన్నద్ధం చేయాలన్నారు. ఉత్తమ ఫలితాలు వచ్చేలా వారిని ప్రోత్సహించాలని సూచించారు. ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

'త్రీఫేజ్' లేక తిప్పలు !



మహారాష్ట్ర ప్రభుత్వం బిగించిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్



ముకదంగూడ గ్రామం

- సరిహద్దు గ్రామాలకు మహారాష్ట్ర ఉచిత కరెంట్
- సింగిల్ ఫేజ్ మాత్రమే సరఫరా
- ఆరు గ్రామాల్లో ఒక్క మీటరు కూడా లేని వైనం
- కొత్త లైన్ వేస్తున్న తెలంగాణ సర్కార్
- వ్యవసాయానికి కరెంట్ ఇవ్వాలని రైతుల వేడుకోలు

కెరమెరి: తెలంగాణ –మహారాష్ట్ర సరిహద్దులో ఉన్న వివాదాస్పద గ్రామాలకు ఏకంగా 30 ఏళ్ల నుంచి మహారాష్ట్ర ప్రభుత్వం ఉచితంగా విద్యుత్ సరఫరా చేస్తోంది. సరిహద్దులోని పరందోళి గ్రామ పంచాయతీ పరిధిలోని పరందోళి, తాండ, కోటా, లేండిజాల, ముకుంగూడ గ్రామ పంచాయతీ పరిధిలోని ముకుదంగూడ, మహరాజ్‌గూడ గ్రామాల్లో మహారాష్ట్ర ప్రభుత్వం ఉచితంగా విద్యుత్ సరఫరా చేస్తోంది. ఆయా గ్రామాల్లో సుమారు 500లకు పైగా కుటుంబాలు నివాసం ఉంటున్నాయి. అయితే ఆయా గ్రామాలకు కేవలం సింగిల్ ఫేజ్ కరెంట్ మాత్రమే సరఫరా చేస్తుండడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు.

సింగిల్ ఫేజ్ మాత్రమే..

సరిహద్దులోని జివితి తాలుకా నుంచి ఆయా గ్రామాలకు సంబంధించిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వరకు త్రీఫేజ్ విద్యుత్ సరఫరా అవుతుంది. కాని గ్రామాలకు మాత్రం కేవలం సింగిల్ ఫేజ్ కరెంట్ పంపిణీ చేస్తున్నారు. విద్యుత్‌కు ఎలాంటి బిల్లులు లేకపోవడంతో త్రీఫేజ్ కరెంట్ ఇవ్వడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. కాగా గతంలో కొన్ని గృహాలకు విద్యుత్ మీటర్లు బిగించినా ఎవరూ చార్జీలు చెల్లించలేదు. దీంతో విద్యుత్ శాఖాధికారులు విద్యుత్ మీటర్లను తొలగించారు. ప్రస్తుతం ఎలాంటి అనుమతి లేకుండా కరెంట్ స్తంభాల నుంచి వైర్లు వేసుకుని ఇళ్లకు విద్యుత్ వాడుతున్నారు. కాగా స్తంభాలకు ఉన్న లైట్లు రాత్రి, పగలు అనే తేడా లేకుండా నిరంతరాయంగా వెలుగుతూనే ఉంటాయి. గతంలో మానిక్‌గఢ్ సిమెంట్ ఫ్యాక్టరీ యాజమాన్యం ఆయా గ్రామాలను దత్తత తీసుకుని కొద్ది రోజులు ఉచితంగా కరెంట్ ఇచ్చినట్లు తెలుస్తోంది. కాగా ఆయా గ్రామాల్లో తెలంగాణ ప్రభుత్వం నుంచి ఎలాంటి విద్యుత్ లైను లేకపోవడం గమనార్హం.

రైతులకు ఇబ్బంది

ఆయా గ్రామాల్లో నివాసం ఉంటున్న వారంతా రైతులే. గ్రామాల్లో వ్యవసాయానికి వినియోగించే త్రీఫేజ్ విద్యుత్ సౌకర్యం లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. త్రీఫేజ్ విద్యుత్ సౌకర్యం లేకపోవడంతో వర్షాల మీద ఆధారపడి పంటలు వేస్తున్నామని పేర్కొంటున్నారు. కొద్ది రోజుల నుంచి తెలంగాణ ప్రభుత్వం ఆయా గ్రామాలకు కొత్త విద్యుత్ లైను వేస్తోంది. తెలంగాణ ప్రభుత్వం త్రీఫేజ్ విద్యుత్ సౌకర్యం కలిగిస్తే విద్యుత్ మీటర్లు తీసుకునేందుకు సిద్ధంగా ఉన్నామని ఆయా గ్రామాల ప్రజలు పేర్కొంటున్నారు. మహారాష్ట్ర ప్రభుత్వం సింగిల్ ఫేజ్ విద్యుత్ మాత్రమే సరఫరా చేస్తుండడంతో మీటర్లు బిగించుకోవడం లేదంటున్నారు.

సింగిల్ ఫేజ్ సరఫరా



మహారాష్ట్ర ప్రభుత్వం త్రీఫేజ్ విద్యుత్ సరఫరా చేయకపోవడంతో ఇబ్బందులు తప్పడం లేదు. ఇళ్లల్లో బోర్లు వేస్తున్నప్పటికీ సింగిల్ ఫేజ్ మోటర్లు బిగిస్తున్నాం. ఆ నీటిని ఇంటి అవసరాలకు వినియోగిస్తున్నాం.

– పుండలిక్, పరందోళి

వ్యవసాయానికి నీరు లేదు



కొద్దిరోజుల నుంచి తెలంగాణ నుంచి కొత్త లైన్ వేస్తున్నారు. చాలా సంతోషం. వ్యవసాయానికి ఉపయోగపడే త్రీఫేజ్ విద్యుత్ సౌకర్యం కల్పించాలి. వ్యవసాయానికి విద్యుత్ లేకపోవడంతో ఇబ్బందులు తప్పడం లేదు.

– లింబాదాస్, సర్పంచ్, ముకదంగూడ

పోగొట్టుకున్న హ్యాండ్‌బ్యాగ్ అప్పగింత



హ్యాండ్‌బ్యాగ్‌ను అందజేస్తున్న గ్రామస్తులు

దహెగాం: మండలంలోని కుంచవెల్లి గ్రామానికి చెందిన గుల్బం సాయికృష్ణకు దొరికిన హ్యాండ్ బ్యాగ్‌ను గురువారం బాధితులకు అప్పగించారు. బెల్లంపల్లికి చెందిన బాదవత్ రంజిత్‌కుమార్ అతని భార్య హ్యాండ్ బ్యాగ్‌ను కన్నెపల్లి, వీగాం మధ్యలో పోగొట్టుకుంది. ఆ సమయంలో గుల్బం సాయికృష్ణ కుంచవెల్లికి వస్తుండగా బ్యాగ్ దొరికింది. బ్యాగులో రూ.5,200 నగదు, స్మార్ట్‌ఫోన్, ఆసుపత్రి చిట్టీలు ఉన్నాయి. అందులో వారి ఫోన్ నంబర్‌కు కాల్ చేసి విషయం చెప్పారు. గ్రామస్తుల ఆధ్వర్యంలో బ్యాగును వారికి అప్పగించారు. ఈ సందర్భంగా సాయికృష్ణను పలువురు అభినందించారు. కాగా, కుంచవెల్లిలో నిర్మిస్తున్న భీమన్న ఆలయానికి రంజిత్‌కుమార్ తన వంతుగా రూ.వెయ్యి చందా అందజేశారు. గ్రామస్తులు రౌతు రాజన్న, మధుకర్, సాయి, శ్రీకాంత్, క్రిష్ణ తదితరులు ఉన్నారు.

పాఠశాలలో పనులు త్వరగా పూర్తిచేయాలి



పనులు పరిశీలిస్తున్న ఎంపీపీ మల్లికార్జున్

ఆసిఫాబాద్‌రూరల్: మన ఊరు–మన బడిలో భాగంగా పాఠశాలలో చేపడుతున్న పనులు త్వరగా పూర్తి చేయాలని ఎంపీపీ మల్లికార్జున్ అన్నారు. మండలంలోని ఈదులవాడ పాఠశాలలో ఈజీఎస్ ఆధ్వర్యంలో చేపడుతున్న పనులను గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలన్నారు. జేఈ కిరణ్, సర్పంచ్ భీమేష్, నాయకులు ఉన్నారు.

'పది' అంతర్గత మార్కుల పరిశీలన

కాగజ్‌నగర్‌టౌన్: కాగజ్‌నగర్ పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలతోపాటు ఎస్టీ ఆశ్రమ హైస్కూల్ (బాలుర)లో పదో తరగతి అంతర్గత మార్కులను విద్యాశాఖ బృందం సభ్యులు తుడూరు నాగేశ్వరరావు, దెబ్బటి సత్యనారాయణ, హదియా బేగం గురువారం పరిశీలించారు. ప్రధానోపాధ్యాయులు సనత్‌తోపాటు ప్రభుత్వ నూతన ఉన్నత పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయులు పర్ష చంద్రశేఖర్‌లకు ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ప్రసాద్, పి.శ్రీధర్, ఎస్.వేణు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో రికార్డుల పరిశీలన

చింతలమానెపల్లి: మండలంలోని గంగాపూర్, డబ్బా జెడ్పీ ఉన్నత పాఠశాలల్లో గురువారం రికార్డులను అంతర్గత మార్కుల పరిశీలన బృందం పరిశీలించింది. బృందం లీడర్ హన్మంతు ఆధ్వర్యంలో పదో తరగతి విద్యార్థుల మార్కుల వివరాలను పరిశీలించారు. ఎఫ్ఎ 1, ఎఫ్ఎ 2, ఎఫ్ఎ3, ఎఫ్ఎ4 పరీక్షల వివరాలను పరిశీలించిన అనంతరం పలు సూచనలు చేశారు. పరీక్షల ధ్రువీకరణ పత్రాలను హెచ్‌ఎంలకు అందజేశారు. బృందంలో ముంజం శ్యాంరావు, తొటం శ్యాంసుందర్ ఉన్నారు.

'మోడల్'లో ప్రవేశాలకు గడువు పెంపు

ఆసిఫాబాద్‌రూరల్: జిల్లాకేంద్రంలోని మోడల్ స్కూల్‌లో 6 నుంచి 10వ తరగతిలో ప్రవేశాల కోసం దరఖాస్తుల గడువు పొడిగించినట్లు ప్రిన్సిపాల్ అబ్దుల్ ఖలీల్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. మార్చి 1లోగా విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

క్రీడలతో స్నేహభావం పెంపొందుతుంది

- ఎమ్మెల్యే కోనేరు కోనప్ప



యువకులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కోనేరు కోనప్ప

బెజ్జూర్: క్రీడలతో స్నేహభావం పెంపొందుతుందని సిర్పూర్ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప అన్నారు. బెజ్జూర్ యూత్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో నిర్వహిస్తున్న తెలంగాణ అమరవీరుల స్మారక ఓపెన్ టు క్రికెట్ టోర్నమెంట్‌ను గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ యువత క్రీడల పట్ల ఆసక్తి పెంచుకోవాలని సూచించారు. క్రీడలతో మానసిక ఉల్లాసంతో పాటు శారీర దృఢత్వంగా ఉంటారని అన్నారు. గ్రామీణ ప్రాంత క్రీడాకారుల్లో ప్రతిభ వెలికితీసేందుకు ఇలాంటి పోటీలు దోహదపడతాయన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ పుష్పలత, పీఏసీఎస్ చైర్మన్ ఓంప్రకాశ్, కోఆప్షన్ సభ్యుడు బషారత్ ఖాన్, చింతలమానెపల్లి ఎంపీపీ నానయ్య, బెజ్జూర్, మర్తిడి ఎంపీటీసీలు పర్వీన్ సుల్తానా జావిద్, వెంకన్న, సర్పంచులు కొత్రంగి శారద భీమన్న, సంతోష్, శంకర్, ఆలం మంగళ అనిల్, బెజ్జూర్ పార్టీ మండల అధ్యక్షుడు సిడాం సకారాం, చింతలమానపల్లి పార్టీ అధ్యక్షుడు వెంకన్న, మాలి సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు రామకృష్ణ, విద్యార్థి విభాగం మండల అధ్యక్షుడు శ్రీనివాస్, యువజన విభాగం మండల అధ్యక్షుడు నరేందర్ గౌడ్ పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం



ప్రారంభిస్తున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి రవీంద్రశర్మ

ఆసిఫాబాద్: జిల్లా కేంద్రంలోని కోర్టు ఆవరణలో బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని జిల్లా ప్రధాన న్యాయమూర్తి రవీంద్రశర్మ గురువారం ప్రారంభించారు. న్యాయవాదులు ముక్తసురేశ్, టి.సురేశ్, నరహరి, ప్రకాశ్‌చంద్ర జైన్, చరణ్‌తేజతోపాటు పలువురు ఆధ్వర్యంలో చలివేంద్రం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా రవీంద్రశర్మ మాట్లాడుతూ మానవ సేవయే మాధవ సేవ అనే దిశలో న్యాయవాదులు నడుచుకోవాలన్నారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బోనగిరి సతీశ్‌బాబు మాట్లాడుతూ వేసవిలో కోర్టులో కక్షిదారుల దాహార్తి తీర్చాలనే ఉద్దేశంతో చలివేంద్రం ఏర్పాటు చేశామన్నారు. సీనియర్ సివిల్ జడ్జి వెంకటేశ్వర్లు, జూనియర్ సివిల్ జడ్జి ఉమామహేశ్వర్, అడిషనల్ జ్యూడిషియల్ మెజిస్ట్రేట్ శెరీనా, న్యాయవాదులు పాల్గొన్నారు.

ప్రతీ ఎకరాకు సాగునీరందిస్తాం



మాట్లాడుతున్న పాల్వాయి హరీశ్‌బాబు

పెంచికల్‌పేట్: బీజేపీ అధికారంలోకి వస్తే ప్రతి ఎకరాకు సాగునీరందిస్తామని బీజేపీ నేత పాల్వాయి హరీశ్‌బాబు తెలిపారు. మండలంలోని చేడ్వాయి, పోతేపల్లి, ఎల్కపల్లి గ్రామాల్లో గురువారం ×ప్రజాగోస–బీజేపీ భరోసా×లో భాగంగా స్ట్రీట్ కార్నర్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిర్పూర్(టి) నియోజకవర్గంలోని రైతులకు ఎమ్మెల్యే కోనేరు కోనప్ప ఒక్క ఎకరానికి సాగునీరు అందించలేదన్నారు. ఉచ్చమల్ల వాగు, బొక్కి వాగు కాల్వలు, అర్కగూడ ప్రాజెక్టు కాల్వలు నిర్మించలేదన్నారు. గొల్లబాయి చెరువును నిర్వీర్యం చేశారన్నారు. సమావేశంలో పార్టీ మండల అధ్యక్షులు జునగరి మధుకర్, నాయకులు గంగన్న, పోశన్న, నానయ్య, నాగేశ్, శంకర్‌గౌడ్, శ్రీనివాస్, కాంతరావు, భీమయ్య, మహేష్, వెంకన్న, తదితరులు పాల్గొన్నారు.

దళారులను నమ్మి మోసపోవద్దు



అవగాహన కల్పిస్తున్న వ్యవసాయాధికారి

కాగజ్‌నగర్‌రూరల్: దళారులను నమ్మి రైతులు మోసపోవద్దని వ్యవసాయశాఖ అధికారి రామకృష్ణ సూచించారు. మండలంలోని ఆరెగూడ, మోసం, కడంబా గ్రామాల్లో గురువారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా రైతులకు నకిలీ విత్తనాలపై అవగాహన కల్పించారు. నకిలీ విత్తనాలు వాడటం వల్ల భూసారం దెబ్బతింటుందన్నారు. పీఎం కిసాన్ డబ్బులు రైతుల ఖాతాల్లో జమ కావాలంటే కచ్చితంగా ఈ కేవైసీ చేసుకోవాలన్నారు. ఏఈవో శైలేష్, రైతులు తదితరులు ఉన్నారు.

కదిలిన అధికార యంత్రాంగం

సాక్షి స్పందన



గ్రామస్తులతో చర్చిస్తున్న అధికారులు

కాగజ్‌నగర్‌రూరల్: మండలంలోని జగన్నాథ్‌పూర్ గ్రామ అంగన్‌వాడీ కేంద్రాన్ని అధికారులు సందర్శించారు. ×అంగన్‌వాడీ కేంద్రాలకు గూడు కరువు× అనే శీర్షికన ఈనెల 22న సాక్షిలో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. గూడు లేక పాఠశాల ఆవరణలో ఆరుబయట విద్యార్థులకు విద్యాబోధన చేస్తున్న విషయాన్ని సాక్షి వివరించింది. గురువారం ఐసీడీఎస్ సీడీపీవో సురేఖ, ఎంపీడీవో శ్రీనివాస్, ఎంపీవో శంకర్, ఎంఈవో భిక్షపతిలు అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించారు. పాఠశాలలో గదులు ఖాళీగా లేకపోవడం, గ్రామంలో ప్రభుత్వ భవనాలు లేక ఓ భవనాన్ని అద్దెకు తీసుకుని అంగన్‌వాడీ కేంద్రాన్ని కొనసాగించేందుకు నిర్ణయించారు. ఈ మేరకు గ్రామస్తులతో చర్చించి నిర్ణయం తీసుకున్నారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మాధవిలత, అంగన్‌వాడీ కార్యకర్త తార, సర్పంచ్ రవి, గ్రామస్తులు పాల్గొన్నారు.

గొర్రెలు, మేకలకు నట్టల నివారణ టీకాలు



దహెగాం: మేకలకు నట్టల నివారణ టీకాలు వేస్తున్న పశువైద్యాధికారి



కౌటాల: టీకా వేస్తున్న పశువైద్య సిబ్బంది



పెంచికల్‌పేట్: మేకకు టీకా వేస్తున్న సిబ్బంది

ఆసిఫాబాద్‌రూరల్: గొర్రెలు, మేకలకు నట్టల నివారణ టీకా వేయాలని రైతులకు ఎంపీపీ మల్లికార్జున్ సూచించారు. మండలంలోని చిర్రకుంట గ్రామంలో గొర్రెలు, మేకలకు గురువారం నట్టల నివారణ టీకాలు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నట్టల నివారణ టీకా వేయడంతో జీవాలకు వ్యాధి నిరోధక శక్తి పెరిగి బలంగా తయారు అవుతాయన్నారు. దీంతోపాటు పునరుత్పాదక శక్తి పెరిగి సంతనోత్పత్తికి తోడ్పాడుతుందన్నారు. పశువైద్యాధికారి మురళీకృష్ణ, వైద్య సిబ్బంది నాగన్న, ప్రశాంత్, పురుషోత్తం, గ్రామస్తులు పాల్గొన్నారు.

దహెగాం: మండలంలోని లగ్గాం, చౌక, పంబాపూర్ గ్రామాల్లో మేకలు, గొర్రెలకు ఉచితంగా నట్టల నివారణ టీకా వేసినట్లు పశువైద్యాధికారి శ్రావణ్‌కుమార్ తెలిపారు. 351 మేకలు, 60 గొర్రెలకు ఈ టీకాలు వేశామన్నారు. రైతులు, పశువైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కౌటాల: కన్నెపల్లి, బోదంపల్లి గ్రామాల్లో మండల పశువైద్యాధికారి శ్రీకాంత్ గురువారం మేకలు, గొర్రెలకు నట్టల నివారణ టీకాలు వేశారు. సర్పంచ్ మోర్లె రమేశ్, సిబ్బంది రాజన్న, సందీప్ పాల్గొన్నారు.

పెంచికల్‌పేట్: కొండపల్లి గ్రామంలో గొర్రెలు, మేకలకు పశువైద్యాధికారి రాకేశ్ ఉచిత నట్టల నివారణ టీకాలు వేశారు. అన్ని గ్రామాల్లో నట్టల నివారణ మందుల పంపిణీ కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. సర్పంచ్ సంజీవ్, సిబ్బంది శివ, ఇస్తారి తదితరులు పాల్గొన్నారు.

పోచమ్మ ఆలయానికి భూమిపూజ



భూమిపూజలో ఎమ్మెల్యే, నాయకులు

దండేపల్లి: మండలంలోని ద్వారకలో రూ.12లక్షల దేవాదాయ, ధర్మాదాయ శాఖ నిధులతో చేపట్టే పోచమ్మ ఆలయ నిర్మాణానికి ఎమ్మెల్యే దివాకర్‌రావు గురువారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆలయాల అభివృద్ధికి ప్రభుత్వం భారీగా నిధులు ఖర్చు చేస్తుందని చెప్పారు. కార్యక్రమాల్లో ఎంపీపీ గడ్డం శ్రీనివాస్, పీఏసీఎస్ చైర్మన్ లింగన్న, వైస్‌ఎంపీపీ అనిల్, సర్పంచ్ గీత, టీఆర్ఎస్ మండల అధ్యక్షుడు శ్రీనివాస్, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

'రాజకీయ ఎదుగుదల ఓర్వలేకనే దాడి'

రెబ్బెన: ఆర్యవైశ్య సామాజిక వర్గానికి చెందిన కేవీ ప్రతాప్ రాజకీయంగా ఎదుగుదలను చూసి ఓర్వలేకనే ఆయనపై దాడికి పాల్పడ్డారని జిల్లా ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడు గులల్బం చక్రపాణి అన్నారు. గురువారం గోలేటిలో ఆయన విలేకరులతో మాట్లాడారు. రాజకీయంగానే ఎదుర్కొవాలి తప్పా ఇలా భౌతిక దాడులకు పాల్పడటం సరికాదన్నారు. ఆయనపై దాడిని జిల్లా ఆర్యవైశ్య మహాసభ తీవ్రంగా ఖండిస్తోందన్నారు. ఇలాంటి సంఘటనలు పునరావృతమైతే రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు. సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి కొలిపాక కిరణ్‌కుమార్, కోశాధికారి మైలారపు సుగుణాకర్, యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు తణుకు రామన్న, జిల్లా ఎగ్జిక్యూటివ్ మెంబర్ బోనగిరి అశోక్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల సందర్శన

చింతలమానెపల్లి: మండలంలోని ఖర్జెల్లి, దిందా, గూడెం గ్రామాల్లోని పాఠశాలలను ఎంపీడీవో మహేందర్ గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయా పాఠశాలల్లో వసతులు, తరగతి గదుల్లో విద్యార్థులకు వేసవి నేపథ్యంలో ఫ్యాన్లు, సౌకర్యాలను ఆయన పరిశీలించారు. ఈ వివరాలు నమోదు చేసుకుని ఉన్నతాధికారులకు నివేదించనున్నట్లు పేర్కొన్నారు. ఆయనతోపాటు సీనియర్ అసిస్టెంట్ పెంటు, ఆయా పాఠశాలల సిబ్బంది తదితరులు ఉన్నారు.

చట్టాలపై అవగాహన ఉండాలి

శ్రీరాంపూర్: కార్మిక చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని అసిస్టెంట్ లేబర్ కమిషనర్ శ్రీనివాస్ తెలిపారు. శ్రీరాంపూర్‌లోని వీటీసీలో పారిశ్రామిక వివాదాల చట్టం, గ్రాట్యూటీ చట్టంపై గురువారం ఆయన కార్మికులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రతి కార్మికుడు తన కోసం ప్రభుత్వం చేసిన చట్టాలు తెలుసుకొని వాటిని వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏరియా డీజీఎం(పర్సనల్)లు గోవిందరాజు, అరవిందరావు, సీనియర్ పీఓలు కాంతారావు, రాజేశ్, దేవేందర్‌రెడ్డి, ప్రకాశ్‌రావు తదితరులు పాల్గొన్నారు.